క్లుప్తంగా

నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు అందజేస్తున్న రవీందర్‌గౌడ్

బొంరాస్‌పేట: గిరిజన విద్యార్థులు చదువులో రాణించి ఉన్నతంగా ఎదగాలని తెలంగాణ విద్యావంతుల వేదిక (టీవీవీ) రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పూర్యానాయక్‌తండాలో హెచ్‌ఎం రవీందర్‌గౌడ్, టీవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రాథమిక స్థాయి నుంచే ఉన్నత విద్య బలపడుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. చదువులో, ఉద్యోగాల్లో, రాజకీయంలో రిజర్వేషన్లు అందుకొని ఉన్నతంగా ఎదగాలన్నారు. ఇందులో టీవీవీ జిల్లా నాయకులు, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు గౌరారం గోపాల్, ఎస్‌ఎంసీ చైర్మన్, యువజన సంఘం నాయకులున్నారు.

కొత్త చట్టాలు అమలు చేయాలి



కలెక్టర్‌కు న్యాయశాస్త్ర పుస్తకం ఇస్తున్న న్యాయవాది

కొడంగల్ : దేశవ్యాప్తంగా సోమవారం నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలను కఠినంగా అమలు చేయాలని కొడంగల్‌కు చెందిన న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రం ఇచ్చారు. కొత్తగా రూపొందించిన న్యాయశాస్త్ర పుస్తకాలను కలెక్టర్‌కు అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో శాంతి భద్రతలకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ప్రజల హక్కులను కాపాడడానికి పోలీసులు చొరవ చూపాలని కోరారు.

అమ్మ పేరుతో మొక్క నాటాలి



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

కొడంగల్ రూరల్ : అమ్మపేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించేందుకు కృషి చేయాలని జీసీపీఎస్ ఉపాధ్యాయులు అబ్దుల్ హాఖ్ అన్నారు. సోమవారం పట్టణంలోని జీసీపీఎస్, బాలాజీనగర్ పాఠశాల ఆవరణలో అమ్మకుగుర్తుగా మొక్కను నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వన మహోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సుహాసిని, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

సీఐ శ్రీనివాస్



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న సీఐ

పరిగి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని పరిగి సీఐ శ్రీనివాస్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని కాళ్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్యాగులు, చెప్పులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా వారిలో చదవాలని ఉత్సాహం నింపినవారవుతారన్నారు. విద్యార్థులు కూడా అదే స్ఫూర్తితో చదివి ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు అన్ని రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చంద్రయ్య, సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలకు పరిగి తైబజార్ వేలం

పరిగి: పట్టణ కేంద్రంలో తైబజార్ వేలాన్ని మున్సిపల్ అధికారులు సోమవారం నిర్వహించారు. వేలంలో ముగ్గురు పాల్గొనగా పట్టణ కేంద్రానికి చెందిన ఎండీ ఫైజన్ రూ.10లక్షల 7వేలకు తైబజార్‌ను సొంతం చేసుకున్నాడు.

భవనం ఒక్కటే.. శాఖలు మూడు



సంత్రకుంట తండా పాఠశాల భవనం



ఉన్న ఒకే గదిలో సాగుతున్న పాఠశాల తరగతులు



అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ కార్యకలాపాలు సాగే వరండా

- ఒకే గదిలో పాఠశాల, వరండాలో అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ
- తండాల్లో తప్పనితిప్పలు

దుద్యాల్ : సమాజంలో ఎంత చిన్న గ్రామమైనా ఒక్కోశాఖకు ఒక్కోభవనం లేదా ఒక్కోగది ఉండటం సర్వసాధారణం. కానీ, ఇక్కడ ఒకే గది ఉన్న పాఠశాల భవనంలో మూడు శాఖలకు సంబంధించిన కార్యకలాపాలు సాగుతుండటం విశేషం. ఇదంతా ఎక్కడ అనుకుంటున్నారా.. మండలంలోని సంత్రకుంట తండాలో జరుగుతున్న రోజువారి తంతు. తండాలో ఒకేగది, వరండాతో పాఠశాల భవనం ఉంది. ఈ భవనంలో ఉన్న ఒక్క గదిలో ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాల నిర్వహిస్తుండగా అంగన్‌వాడీ కార్యకర్త వరండాలో ఒక పక్క అంగన్‌వాడీ కేంద్రం, పంచాయతీ కార్యదర్శి మరోపక్క గ్రామ పంచాయతీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. మూడు శాఖలకు సంబంధించిన కార్యకలాపాలు ఒకే భవనంలో సాగుతుండటంతో చాలా ఇబ్బందిగా ఉందని విద్యార్థులు, తండావాసులు వాపోతున్నారు. పాఠశాల విద్యార్థులకు తరగతులు నడుస్తున్నప్పుడు అంగన్‌వాడీ చిన్నారుల చేసే అల్లరితో చాలా ఇబ్బందిగా ఉందని విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వేర్వేరుగా కార్యాలయాలకు స్థలం కేటాయించి, భవనాలను నిర్మించాలని, లేని యెడల ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని తండావాసులు కోరుతున్నారు.

రైతు భరోసాతో ఆనందం

బొంరాస్‌పేట: ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన రైతుభరోసా విధానాలతో అన్నదాతల్లో ఆనందం నింపిందని మండల పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ అన్నారు. రైతు వేదికలో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసా పథకాన్ని చిన్నకారు, సన్నకారు రైతులకు వర్తింపజేసి ప్రభుత్వానికి ఆర్థికభారం లేకుండా చేశారని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వం భూస్వాములకు రైతుబంధు పేరుతో కోట్లు నష్టం చేయడం బాధాకరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల ఆలోచనలను పాటిస్తారని అభినందించారు.

నేడు పీఏసీఎస్ సమావేశం

కొడంగల్ రూరల్ : పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో మంగళవారం ఉ. 10. 30గంటలకు పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్ గుప్తా అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించనున్నట్లు కార్యాలయ సిబ్బంది సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతుబంధు పథకంపై రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా సహకార సంఘం అధికారుల ఆదేశాల మేరకు నిర్వహించే ప్రత్యేక సమావేశానికి పీఏసీఎస్ కార్యవర్గ సభ్యులు, సంఘం సభ్యులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.



మాట్లాడుతున్న మండల పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ

అభివృద్ధికి పన్నుల సేకరణ కీలకం



తహసీల్దార్ సమక్షంలో నిర్వహిస్తున్న వేలం

తహసీల్దార్ మునీరొద్దీన్

యాలాల: పంచాయతీల అభివృద్ధికి పన్నుల సేకరణే కీలకమని యాలాల పంచాయతీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ మునీరొద్దీన్ అన్నారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే వారాంతపు సంతకు సంబంధించి తైబజార్ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు, వ్యాపారుల నుంచే వివిధ రూపంలో వచ్చే పన్నులతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు ఆస్కారం ఉంటుందన్నారు. తైబజార్‌ను గ్రామానికి చెందిన పండరి ప్రభాకర్ రూ.57వేలకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో ఎంపీఓ యాద య్య, పంచాయతీ కార్యదర్శి అంజయ్యగౌడ్, పాండు, శేఖర్, రాములు, శ్రీనివాస్, బాల్‌రాజ్ ఉన్నారు.

కొత్త విత్తనాలు నాటిన ఉపాధి సిబ్బంది



నర్సరీని పరిశీలిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

పెద్దేముల్: మొక్కలు లెక్కలకేనా? అనే శీర్షికతో సోమవారం సాక్షి జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైన వార్తకు సోమవారం మండల ఉపాధి హామీ అధికారులు కదలివచ్చారు. మండలంలోని గాజీపూర్, తట్టెపల్లి గ్రామాల్లోని వన నర్సరీలను, వాడిపోతున్న మొక్కలను తట్టెపల్లి టెక్నికల్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. గాజీపూర్‌లోని నర్సరీల్లో ఖాళీగా ఉన్న బెడ్లను పరిశీలించి కొత్త విత్తనాలు నాటారు. ఏ నర్సరీల్లో మొక్కలు ఎండిపోయిన, నీరు అందక పాడైన ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లదే బాధ్యత ఉంటుందన్నారు. తట్టెపల్లి నర్సరీల్లో ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ ప్రకారం మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. గాజీపూర్‌లో మొక్కల కొరత లేదన్నారు. వారితో పాటు గాజీపూర్ ఫీల్డ్ అసిస్టెంట్ అబ్రహం ఉన్నారు.

రాగిజావ పంపిణీ

కుల్కచర్ల: విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు రాగిజావ ఉపయోగకరంగా పని చేస్తుందని ఎంఈఓ అబీబ్ అహ్మద్ అన్నారు. సోమవారం చౌడాపూర్ మండల విద్యావనరుల కేంద్రంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు రాగిజావ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని ఇస్తూ వారిలో రోగనిరోధశక్తిని పెంచడంతో పాటుగా ఆరోగ్యకంగా ఉండేందుకు రాగిజావ వంటివి అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాలలో రాగిజావను విద్యార్థులకు అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు రఘు, విజయ్‌కుమార్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

పరిగి: రైతు భరోసా పథకంపై సోమవారం పట్టణ కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రైతు అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఎన్ని ఎకరాల వరకు రైతు భరోసా అందించాలని అధికారులు రైతుల అభిప్రాయాలు తీసుకున్నారు. కొంత మంది రైతులు పది ఎకరాల వరకు అందించాలని, మరి కొంత మంది ఐదు ఎకరాల వరకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఓ ఈశ్వరయ్య, పీఏసీఎస్ చైర్మన్ శ్యాం సుందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల అభిప్రాయాలు తీసుకుంటున్న అధికారులు

చివరి సమావేశం.. గరంగరం

- సమస్యలు ప్రస్తావించిన ఎంపీటీసీలు
- పరిష్కరిస్తామన్న అధికారులు



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీటీసీ

తాండూరు రూరల్: చివరి మండల సర్వసభ్య సమావేశం గరం గరంగా సాగింది. తాండూరు మండల ఎంపీపీ అనితాగౌడ్ అధ్యక్షతన సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ నెల 4వ తేదీతో ఎంపీపీ, ఎంపీటీసీల పదవికాలం ముగుస్తోంది. ఇదే ఆఖరు సమావేశం కావడంతో ఎంపీటీసీలందరు హాజరయ్యారు. కొంతమంది ఎంపీటీసీలు సమస్యలను సమావేశంలో ప్రస్తావించారు. అంతారంలో 15 రోజుల నుంచి తాగునీరు రాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని ఎంపీటీసీ శాంతు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం తాండూరు పట్టణం శేష్‌ప్రభ థియేటర్ నుంచి గౌతపూర్ వరకు ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారిందని ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి ఆర్అండ్‌బీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే కరన్‌కోట్ గ్రామంలో 10 వేల మంది జనాభా ఉన్నారని ఒకే రేషన్ దుకాణం ఉందని ఎంపీటీసీ రాజ్‌కుమార్ సభ దృష్టికి తెచ్చారు. మల్కాపూర్‌లో ఐసీఎల్ ఫ్యాక్టరీకి వెళ్లేదారిలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని వాటిని సరిచేయాలని ఎంపీటీసీ రవిసింథే సమావేశంలో కోరారు. ఆఖరు సమావేశం కావడంతో ఎంపీటీసీలను ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు సన్మానించారు. ప్రజలు అవకాశం ఇస్తే మళ్లీ గెలిచి సమావేశానికి వస్తామని ఎంపీటీసీలు చెప్పారు. ఎంపీటీసీలను పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు.

అవగాహన లేక..అర్జీలు రాక



లేక ఖాళీగా కూర్చున్న అధికారులు

- కుల్కచర్లలో ప్రజావాణిపై అవగాహన కల్పించక పోవడంతో ఫిర్యాదులు రాని వైనం

కుల్కచర్ల: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే ఉద్దేశంతో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రతీ మండలంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించింది. కాని, అధికారులు ప్రజావాణిపై ప్రజల్లో అవగాహన కల్పించకపోవడంతో ప్రజావాణిలో అర్జీలు ఇచ్చేందుకు ఎవరూ కూడా ముందుకురాని పరిస్థితి నెలకొంది. సమస్యలను వినతి రూపంలో అధికారులకు తెలియజేసేందుకు ఒక వేదిక ఉందన్న విషయం ఎవరికీ తెలియకపోవడంతో ప్రజలెవరూ రాక ప్రజావాణి వెలవెలబోయింది. సోమవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎటువంటి ప్రత్యేక ఫిర్యాదులు అందలేదు. ప్రతీరోజు వచ్చే సాధారణ విద్యుత్తు సంబంధిత దరఖాస్తులను ప్రజావాణిలో చూపిస్తూ 12దరఖాస్తులు వచ్చాయని అధికారులు పేర్కొనడం గమనార్హం.

అవగాహన కల్పించాలి

ప్రజావాణిలో సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని క్షేత్రస్థాయిలో గ్రామాల్లో ఉండే ప్రజలకు తెలియకపోవడంతో ఎవరూ కూడా సమావేశానికి వచ్చి ఫిర్యాదులు ఇవ్వలేదనే చర్చ జరుగుతోంది. అధికారులు అలసత్వం వహించడం కారణంగానే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమం నామమాత్రంగా మారిందని ప్రజానీకం వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని పలువురు పేర్కొంటున్నారు.

ఆలయ భూములకు వేలం వేయండి

మాజీ సర్పంచ్ అశోక్ రెడ్డి

దోమ : సంజీవస్వామి దేవాలయం పరిధిలో ఉన్న భూములన్నింటిని అధికారులు కౌలుకు వేలం వేసేలా చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ అశోక్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.మండల పరిధిలోని దొంగ ఎన్కేపల్లి గ్రామంలో వెలసిన సంజీవ స్వామి దేవాలయానికి 104 ఎకరాల 19 గుంటల భూమి ఉంది. అయితే కేవలం గూడూర్ గ్రామ పరిధిలో ఉన్న భూములు మాత్రమే అధికారులు కౌలు వేలం వేస్తామని ప్రకటనలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. పరిగి లోని మంచన్‌పల్లి, పరిగి, చెంగోముల్, రావులపల్లి, ఖుధావంద్‌పూర్, బ్రాహ్మణపల్లి, కిష్టాపూర్, హీరాపూర్, దొంగ ఎన్కేపల్లి, అల్లాపూర్, కేర్వెల్లి, లక్నాపూర్ గ్రామాల్లో ఆలయానికి సంబంధించిన భూములను కూడా కౌలు వేలం వేయాలన్నారు. అంతకు ముందు కౌలు వేసిన డబ్బులు గుడి పేరుపై ఉన్నాయని, అధికారులు వెంటనే గుడి నిర్మాణ పనులు చేపట్టాలని తెలిపారు. లేని పక్షంలో గ్రామస్తులతో కలసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

ఎంపీడీఓ రాములు

బంట్వారం: అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఎంపీడీఓ రాములు అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని నాగవరం తండా, రొంపల్లి, మంగ్రాస్‌పల్లి పాఠశాలలు సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత హెచ్‌ఎంలకు పలు సూచనలు చేశారు. డబ్బును ఆదా చేసేలా పనులు ఉండాలన్నారు. వృథా ఖర్చులకు తావు లేకుండా చూడాలని చెప్పారు. చేపట్టిన ప్రతి పనిలో నాణ్యత ఉండేలా సూచుకోవాలని తెలిపారు. మౌలిక వసతులు కల్పించడంతో పాటు పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. బంట్వారం మండలానికి సంబంధించి రూ.కోటి మంజూరు అయ్యాయన్నారు. చేపట్టిన పనుల ఆధారంగానే బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చంద్రప్ప, ఎంపీఓ విజయ్‌కుమార్, ఏపీఓ సుధాకర్, ఈసీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రజావాణికి భారీగా అర్జీలు



యాలాల: అర్జీలు తీసుకుంటున్న అధికారులు

యాలాల: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 21 అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. ప్రజావాణిలో ఎంపీడీఓ పుష్పలీల, తహసీల్దార్ మునీరొద్దీన్, ఏఓ యాదగిరి, ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జీరో బిల్లు, గ్యాస్ సబ్సిడీ కోరుతూ ఎక్కువ అర్జీలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

6 దరఖాస్తులు

ధారూరు: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆరు దరఖాస్తులు అందాయని ఎంపీడీఓ నర్సింహులు తెలిపారు. పింఛన్లు, విద్యుత్ బిల్లులు, విద్యుత్ స్తంభాలు వేయించాలని, పట్టా పాసుపుస్తకాలు, మురికికాల్వ నిర్మించాలని దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్, ఎంపీఓ షఫీ ఉల్లా, ఇరిగేషన్, విద్యుత్ ఏఈలు నీరజ, వేణుగోపాల్‌రెడ్డిలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతాబాయి, ఏపీఓ సురేష్, ఏపీఎం పండరీ పాల్గొన్నారు.

నాలుగు ఫిర్యాదులు

మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి నాలుగు ఫిర్యాదులు వచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి పేర్కొన్నారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, విద్యుత్‌కు సంబంధించిన అర్జీలు వచ్చినట్లు చెప్పారు.

రెవెన్యూ దరఖాస్తులే ఎక్కువ

బొంరాస్‌పేట: ప్రజాసమస్యల పరిష్కారం కోసం మండల స్థాయిలో నిర్వహించిన ప్రజావాణిలో రెవె న్యూ దరఖాస్తులే ఎక్కువ అందాయి. మండల పరి షత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీపీ హేమీబాయి, ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకన్నగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన దరఖాస్తుల స్వీకరణలో ఎనిమిది మంది అర్జీలు అందజేశారు.

సమస్యలు పరిష్కరించండి

కొడంగల్ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. శివారులో పురాతన చరిత్ర కలిగి సిద్దులు తపస్సు చేసిన ప్రాంతంగా పేరుగాంచిన సిద్ధనొంపు ఆంజనేయస్వామి ఆలయ పరిసరా ల్లో పరిశుభ్రత, రక్షణ, పవిత్రతను కాపాడాలని హిందూవాహిని సభ్యుడు భానుప్రకాశ్ మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్‌కు దరఖాస్తు ఇచ్చారు.



కమిషనర్‌కు దరఖాస్తు ఇస్తున్న భానుప్రకాశ్

ప్రజా సమస్యల పరిష్కారం

తాండూరు రూరల్: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీడీఓ విశ్వప్రసాద్ అన్నారు. తాండూరు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రజవాణిలో వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిష్కరిస్తారని అన్నారు.

ఏళ్ల తరబడి సతమతం

దోమ : ప్రజావాణితో ప్రజాసమస్యల పరిష్కారం దొరుకుతుందని ఎంపీడీఓ మహేశ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రజలు నుంచి ఫిర్యాదులను స్వీకరించి ఆయా శాఖల అధికారులకు అందజేశామని తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణి ద్వారా ఏళ్ల తరబడి సతమతమవుతున్న సమస్యల పరిష్కారానికి మార్గం దొరుకుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పురుషోత్తం, మండల వైద్యాధికారి రజిత, వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు, ఎంపీఓ సోమలింగం, ఏపీఓ దస్తయ్య, ఏఈ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన

ముున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్

పరిగి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం.. డెంగ్యూ వ్యాధిని నిర్మూలిద్దామని మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్ సూచించారు. సోమవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా పట్టణ కేంద్రంలో డెంగ్యూ వ్యాధిపై ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత వర్షాకాలంలో దోమల నివారణపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దోమల నివారణకు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు దరి చేరవన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటయ్య, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, నాయకులు మౌలానా తదితరులు పాల్గొన్నారు.

చిన్న, సన్న కారు రైతులకే రైతుబంధు

సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి

దోమ : పెట్టుబడి సహాయం చిన్న, సన్న కారు రైతులకు మాత్రమే వర్తింపజేయాలని, ఎరువులు, విత్తనాలతో పాటు సబ్సిడీ పరికరాలను రాయితీతో అందిస్తే ఎంతో మేలు జరుగుతుందని సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి అభిప్రాయపడ్డారు. ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా ఆర్థిక సహాయంపై రైతుల అభిప్రాయ సేకరణ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి సీజన్‌లో సాగు భూమిని పరిశీలించి సహాయం అందించడం సాధ్యమయ్యే పని కాదన్నారు. ప్రభుత్వాలు మారిన రైతుకు అందే సాగు సహాయాన్ని విత్తనాలు విత్తుకునే సమయానికి అందిస్తే ఎంతో మేలు జరుగుతుందన్నారు. మండలంలో ఫిజికల్ ఏరియా జియోగ్రాఫికల్ ప్రకారం 43 వేల ఎకరాల భూమి ఉంటే వ్యవసాయ శాఖ రికార్డులో మాత్రం 33 వేల ఎకరాలు సాగులో ఉన్నట్లు చెబుతున్నాయని తెలిపారు. వాటిని అధికారులు సరి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసా య సహకార సంఘం అధికారులు, రైతులు, పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపయోగంగా పనుల నిర్వహణ

కుల్కచర్ల: అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల త్వరలో పూర్తి చేయాలని కుల్కచర్ల మండల ప్రత్యేకాధికారి సరళాదేవి అన్నారు. సోమవారం మండలంలోని అంతారం, బిందెంగడ్డ తండా, తదితర గ్రామాల్లో నిర్వహించిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉపయోగంగా ఉండేలా పనుల నిర్వహణ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఓ చంద్రశేఖర్, ఏపీఎం శోభ, పంచాయతీ కార్యదర్శి ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాగు పద్ధతిలో సూచనలు తప్పనిసరి

వ్యవసాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మీకుమారి



జీలుగను పరిశీలిస్తున్న సౌభాగ్యలక్ష్మీకుమారి

దోమ : రైతులు సాగు పద్ధతిలో వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలని పరిగి తాలూక వ్యవసాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మీకుమారి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మోత్కూర్ గ్రామంలో రైతుల పంట పొలాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీకుమారి మాట్లాడుతూ.. ప్రతి రైతు తేమ శాతం చూసి విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. సోయాబీన్ అయితే, జూలై 7న, మొక్కజొన్న, కందులు అయితే జూలై 15న, పత్తి అయితే జూలై 20 వరకు విత్తుకోవాలని తెలిపారు. వరిలో తెలంగాణ సోనా అయితే ఈ నెల మొదటి వారంలో నారు పోసుకోవాలని, మిగతా వాటికి ప్రస్తుతం నారు పోసుకోవచ్చని చెప్పారు. అనంతరం గ్రామంలో ఓ రైతు వేసిన జీలుగ సాగును ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ సాయితేజ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.